క్లుప్తంగా

వైద్యులకు విద్యార్థుల శుభాకాంక్షలు



వనస్థలిపురం: ఇంటర్నేషనల్ డాక్టర్స్ డే సందర్భంగా వనస్థలిపురం బచ్‌పన్ స్కూల్‌కు చెందిన అకడమిక్ హైట్స్ విద్యార్థులు శనివారం వనస్థలిపురం ఏరియా ఆస్పత్రిని సందర్శించారు. ఈ సందర్భంగా ఆస్పత్రిలోని ఈజేహెచ్‌ఎస్ సెంటర్లో డాక్టర్లను కలసి వారికి డాక్టర్స్ డే శుభాకాంక్షలు తెలిపారు. తాము స్వయంగా తయారు చేసిన గ్రీటింగ్ కార్డ్స్‌ను వారికి అందజేశారు. ఈజేహెచ్‌ఎస్ సెంటర్ ఇన్‌చార్జి మెడికల్ ఆఫీసర్ డాక్టర్ సమీర్, డాక్టర్ శాంతకుమార్, మెడికల్ ఆఫీసర్ డాక్టర్ యజువాన్ మహమ్మద్, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రతిభ చాటిన విద్యార్థులకు సన్మానం

నాగోలు: విద్యార్థులు చదువులో రాణించి ఉన్నత శిఖరాలు చేరుకోవాలని నాగోలు డివిజన్ కార్పొరేటర్ చింతల అరుణ సురేంద్రనాథ్ అన్నారు. శనివారం నాగోల్ డివిజన్ ప్రభుత్వ పాఠశాలల హైస్కూల్ క్లాస్‌మేట్ క్లబ్ ఎల్‌బీనగర్ ఆధ్వర్యంలో నాగోలులోని ప్రభుత్వ పాఠశాలలో 10వ తరగతిలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు నగదు పురస్కారాలను అందజేశారు. కార్యక్రమంలో క్లాస్‌మేట్ క్లబ్ సభ్యులు విజయ్, ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆకట్టుకుంటున్న ఉభయ వేదాంత పండిత సభలు

మన్సూరాబాద్: శ్రీవైష్ణవ సేవా సంఘం, తెలంగాణ, ఎస్వీఎస్ ట్రస్ట్ హైదరాబాద్, సత్సంప్రదాయ పరిరక్షణ సభ ట్రస్ట్ వరంగల్, ఉభయ వేదాంత పండిత పరిషత్ భాగ్యనగర్ శాఖ సంయుక్త నిర్వహణలో మన్సూరాబాద్ చంద్రపురి కాలనీలోని శ్రీవైష్ణవ సదనంలో జరుగుతున్న ఉభయ వేదాంత పండిత సభలు ఆకట్టుకుంటున్నాయి. రెండవ రోజు మరిగంటి శ్రీరంగాచార్య స్వామి స్మృత్యాంజలిగా శనివారం సభలు ప్రారంభమయ్యాయి. ముఖ్య అతిథిగా హాజరైన పండితరత్న శిరిశినహాళ్ వేంకటాచార్య జ్యోతిప్రజ్వలన చేసి సభలను ప్రారంభించారు. అప్పన్ కందాడై పెరుమాండ్లచార్య స్వామి మంగళాశాసనాలు చేయగా నల్లాన్ చక్రవర్తులు నర్సింహాచార్యులు స్వాగతోపన్యాసం చేశారు. కండ్లకుంట వెంకటనర్సింహా చార్యులు, డాక్టర్ టీకేవీ రాఘవన్, ఆచి పాండురంగాచార్యులు వేదాంతసారాలపై విశదీకరించారు. ఎస్వీఎస్ ట్రస్ట్ కార్యదర్శి లక్ష్మీనాథాచార్యులు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో శ్రీవైష్ణవ సేవా సంఘం, తెలంగాణ అధ్యక్షుడు ఎస్టీ చారి, నేతలు సేనాపతి మోహన్, వింజమూరి విజయకుమారాచార్యులు, ఆచార్య వేణు పాల్గొన్నారు.

ఆరోగ్య సమస్యలపై అప్రమత్తంగా ఉండాలి

ఎల్‌బీనగర్: ప్రజలు తమ ఆరోగ్యం పట్ల అప్రమత్తతోపాటు జాగ్రత్తలు తీసుకోవాలని బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి అన్నారు. వైదేహీనగర్ కాలనీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో శనివారం ఏర్పాటు చేసిన మెగా వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ... రోజురోజుకూ కొత్తకొత్త రోగాలు ప్రజల దరికి చేరుతున్నాయని, ప్రజలు వ్యాధుల పట్ల డాక్టర్ల సలహాలు సూచనలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఆరోగ్య సమస్యలు ఎదుర్కొంటున్న ప్రజల కోసం మెగా వైద్య శిబిరాలను ఏర్పాటు చేయడం అభినందనీయమని పేర్కొన్నారు. ఇలాంటి వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కాలనీ అధ్యక్షుడు దామోదర్‌రెడ్డి, కాలనీ నేతలు కిషన్‌రావు, ప్రసాద్, జంగారెడ్డి, చౌదరి, బుచ్చయ్య, ఆంజనేయులుతో పాటు ఆపోలో హాస్పిటల్, స్మార్ట్ విజన్ డెంటల్ ఆస్పత్రు వైద్యులు పాల్గొన్నారు.

సైదాబాద్‌లో వాటర్ లీకేజీని అరికట్టండి



లీకేజీని పరిశీలిస్తున్న కార్పొరేటర్ అరుణ

సైదాబాద్: డివిజన్ పరిధిలోని పలు కాలనీలు, బస్తీల్లో వాటర్ లీకేజీని అరికట్టాలని సైదాబాద్ కార్పొరేటర్ కొత్తకాపు అరుణరవీందర్‌రెడ్డి వాటర్‌వర్క్స్ అధికారులకు సూచించారు. శనివారం కార్పొరేటర్ సైదాబాద్ డివిజన్ పరిధిలోని బ్రహ్మానందం కాలనీలో వాటర్‌వర్క్స్ అధికారులతో కలిసి పర్యటించారు. కాలనీలో పలుచోట్ల తాగునీరు వృథాగా పోవటాన్ని ఆమె పరిశీలించారు. కాలనీలో ధ్వంసమైన మ్యాన్‌హోళ్లకు మరమ్మతులు చేయించాలని అధికారులను ఆదేశించారు. లీకేజీ సమస్య తీవ్రంగా ఉన్న చోట్ల నూతన పైప్‌లైన్‌లకు ప్రణాళికలు రూపొందించాలని కార్పొరేటర్ అధికారులకు సూచించారు. వాటర్‌వర్క్స్ మేనేజర్ అల్తాఫ్, కాలనీవాసులు పాల్గొన్నారు.

ఆటోనగర్ ఇసుక లారీల అడ్డా తొలగింపునకు...

ప్రజల సహకారం అవసరం

- వనస్థలిపురం తూర్పు కాలనీల సంయుక్త సమావేశం
- అందరి సహకారంతోనే అడ్డా తొలగింపు సాధ్యం
- ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

వనస్థలిపురం: ఆటోనగర్ వద్ద లారీల అడ్డా తొలగింపుకు వివిధ శాఖల అధికారులు, కాలనీ సంక్షేమ సంఘాల సహకారం అవసరమని ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. శనివారం హయత్‌నగర్ డివిజన్ పరిధి లోని హైకోర్టు కాలనీలో ఈస్టర్న్ కాలనీస్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన వనస్థలిపురం తూర్పు 22 కాలనీల సంయుక్త సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా హైకోర్టు కాలనీ కమ్యూనిటీ హాలు ప్రాంగణం చుట్టూ ఏర్పాటు చేసిన ఐరన్ జాలీని, కాలనీవాసులు ఏర్పాటు చేసుకున్న సీసీ కెమెరాలను స్థానిక కార్పొరేటర్ క్లెం నవజీవన్‌రెడ్డితో కలసి ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో పలు కాలనీల సంక్షేమ సంఘాల నాయకులు మాట్లాడుతూ... ఆటోనగర్ వద్ద హైకోర్టు కాలనీ సమీపంలో కొన్నేళ్లుగా కొనసాగుతున్న ఇసుక, ఇటుక లారీల అడ్డాతో పరిసర కాలనీల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. లారీల అడ్డా వల్ల దుమ్ము, ధూళి, మలమూత్ర విసర్జనలు, అసాంఘిక కార్యకలాపాలు చోటుచేసుకుంటున్నాయని అన్నారు. స్థల యజమానులైన రెండు కుటుంబాల వల్ల 2000 మంది గృహస్థులు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు.

- పలువురు మహిళలు మాట్లాడుతూ... లారీల అడ్డా వద్ద రాత్రివేళ వేళ్ళలు సంచరిస్తున్నారని, దీంతో పోకిరీలు చేరి కాలనీలకు వచ్చే మహిళల పట్ల అసభ్యంగా ప్రవర్తిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.
- పలు కాలనీల సంక్షేమ సంఘాల నాయకులు మాట్లాడుతు వర్షాకాలంలో తమ కాలనీలు ముంపుబారిన పడుతున్నాయని, తగిన చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే, కార్పొరేటర్, అధికారులను కోరారు.
- స్పందించిన ఎమ్మెల్యే దేవిరెడ్డి మాట్లాడుతూ... లారీల అడ్డా స్థలం ప్రైవేటు వ్యక్తులకు చెందినందున తొలగింపునకు కొన్ని ఇబ్బందులు ఎదురవుతున్నాయని అన్నారు. రోడ్లపై పార్కింగ్ చేసే వాహనాలకు అధిక చాలానాలు విధించాలని ట్రాఫిక్ ఏసీపీ హరికృష్ణకు సూచించారు.
- ఈ సందర్భంగా ఏసీపీ హరికృష్ణ మాట్లాడుతూ... లారీల అడ్డా వల్ల కాలనీల ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళతామని, కమిషనర్ గెజిట్ ఇస్తే అడ్డా తొలగింపు సాధ్యమవుతుందని ఎమ్మెల్యేకు వివరించారు. దీంతో ఎమ్మెల్యే కాలనీ సంక్షేమ సంఘాలతో కలసి కమిషనర్‌ను కలుస్తామని, గెజిట్ తీసుకురావడానికి కృషి చేస్తామని అన్నారు.
- వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని ఎస్ఎన్‌డీపీ పనులలో భాగంగా రూ. 110 కోట్లతో 10 కిలోమీటర్ల మేర డ్రైన్ల నిర్మాణం పూర్తి అయిందని, మరో 3 కిలోమీటర్ల పనులు పూర్తయితే చాలావరకు వరద సమస్యలు ఉండవని ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి స్పష్టం చేశారు.
- కాలనీవాసులు కోరినట్లు పనామా చౌరస్తా, హైకోర్టు కాలనీల వద్ద హైవేపై రోడ్డు దాటడానికి ఫుట్‌ఓవర్ బ్రిడ్జిలు ఏర్పాటు చేయిస్తామని అన్నారు. సాయినగర్ కాలనీలో అద్దె భవనంలో కొనసాగుతున్న సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం వల్ల పార్కింగ్ సమస్యలు తలెత్తుతున్నాయని, దానిని వేరే చోటుకు తరలించడానికి చర్యలు తీసుకుంటామని అన్నారు.
- కార్యక్రమంలో కార్పొరేటర్ క్లెం నవజీవన్‌రెడ్డి, డీసీ మారుతీదివాకర్, మాజీ కార్పొరేటర్లు సామ తిరుమల్‌రెడ్డి, కొప్పుల విఠల్‌రెడ్డి, ట్రాఫిక్ ఏసీపీ హరికృష్ణ, ఇన్‌స్పెక్టర్ బాలూనాయక్, జలమండలి జీఎం వినోద్, ఏఈ వాహిణి, ఏఎంహెచ్‌ఓ నీలిమ, ఈస్టర్న్ కాలనీస్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు దీపావళి శ్రవణ్‌కుమార్, ప్రధాన కార్యదర్శి గుత్తా లక్ష్మణ్‌రెడ్డి, కోశాధికారి బాదం శ్రీనివాస్, సుదర్శన్ రెడ్డి, నేతలు నరసింహారావు, మధుసూదన్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, భరత్‌సింగ్, సుధీర్‌రెడ్డి, శ్రీకాంత్, జలంధర్, ప్రవీణ్‌గౌడ్, బాలరాజుగౌడ్ మాధవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



హాజరైన వివిధ కాలనీల సంక్షేమ సంఘాల నాయకులు

న్యాయవాదుల రక్షణకు ప్రత్యేక చట్టం తేవాలి

బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్



మాట్లాడుతున్న బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ప్రవీణ్‌కుమార్

దిల్‌సుఖ్‌నగర్: రాష్ట్రంలో న్యాయవాదులకు కోసం ప్రత్యేక రక్షణ చట్టాన్ని తీసుకురావాలని బహుజన సమాజ్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్.ఎస్.ప్రవీణ్‌కుమార్ డిమాండ్ చేశారు. శనివారం ఆర్‌కేపురం డివిజన్‌లోని భాగ్యనగర్ ఫంక్షన్ హాల్‌లో బహుజన అడ్వకేట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయవాదుల రక్షణ చట్టంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ... రాష్ట్రంలో న్యాయవాదులపై జరుగుతున్న దాడులను ముఖ్యమంత్రి కేసీఆర్ ఎందుకు సమాధానం చెప్పడం లేదని అన్నారు. రాష్ట్రంలో రోజురోజుకూ న్యాయవాదులపై దాడులు పెరిగిపోతున్నాయని తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం రక్షణ చట్టం తీసుకోవాలని డిమాండ్ చేశారు. తెలంగాణ రాష్ట్రం సాధన కోసం జరిగిన ఉద్యమంలో న్యాయవాదుల పాత్ర మరువలేనిదన్నారు. మరోసారి న్యాయవాదులు తమ హక్కుల కోసం ఉద్యమించాల్సిన అవసరం ఏర్పడిందని ఆయన పేర్కొన్నారు. రాష్ట్రంలో న్యాయవాదులపై నిరంతరం దాడులు జరుగుతున్నాయని తెలిపారు. బహుజన్ సమాజ్ పార్టీ అధికారంలోకి వచ్చిన తరువాత న్యాయవాదులకు, డాక్టర్లు, ఇతర రంగాల్లో ఉన్నవారికి ప్రత్యేక సమగ్ర రక్షణ చట్టాన్ని తెస్తామని పేర్కొన్నారు. 41(ఎ) సీఆర్‌పీసీ చట్టాన్ని పోలీసులు నిర్వీర్యం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. 41(ఏ) వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో ఎస్ఐలకు, సీఐలకు పోస్టింగ్‌లు కావాలంటే స్థానిక ఎమ్మెల్యే లెటర్ ఇస్తేనే పోస్టింగ్‌లు వస్తున్నాయని, డీఎస్పీ స్థాయి అధికారులకు మంత్రులు డీజీపీ లేటర్ రాస్తేనే పోస్టింగ్‌లు వచ్చే పరిస్థితి ఉందన్నారు. ఇలా ఉంటే పేదలకు ఎలా న్యాయం జరుగుతుందని ప్రశ్నించారు. న్యాయవాదులపై రాజకీయ నాయకుల వత్తిడి తగ్గే విధంగా చట్టాలు తీసుకురావాలని ఆయన డిమాండ్ చేశారు. యువ న్యాయవాదుల కార్యాలయాల కోసం బహుజన రాజ్యంలో 5 లక్షల నుంచి 10 లక్షల ఆర్థిక సహాయం చేస్తామని తెలిపారు. ఈ సందర్భంగా బహుజన అడ్వకేట్స్ అసోసియేషన్ సభ్యులు మాట్లాడుతూ న్యాయవాదుల హెల్త్ ఇన్సూరెన్స్ రూ. 2 లక్షల నుంచి రూ. 5 లక్షల వరకు పెంచాలి, జూనియర్ న్యాయవాదులకు నెలకు రూ. 5 వేల స్కాలర్‌షిప్ ఇవ్వాలని, మహిళ న్యాయవాదులపై వేధింపులను అరికట్టి, వారికి రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో రంగారెడ్డి జిల్లా కోర్టు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు రవీందర్, పటోళ్ల మాధవరెడ్డి, ఫణీంద్ర భార్గవ్, రాధిక, స్వప్న, అర్జున్, రమణ, గ్యార సతీష్, ప్రవీణ్, జగన్‌గౌడ్, కిరణ్‌కుమార్, రామ్ స్వర్ణలత, కవిత తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా డాక్టర్స్ డే



ఓజోన్ హాస్పిటల్‌లో డాక్టర్స్ డే వేడుకలను నిర్వహిస్తున్న దృశ్యం

దిల్‌సుఖ్‌నగర్: కళ్ల ముందు కనిపించే దేవుడు వైద్యుడు అని ఓజోన్ హాస్పిటల్ చైర్మన్ బి.వి.సత్యసాయిప్రసాద్ అన్నారు. శనివారం కొత్తపేటలోని ఓజోన్ హాస్పిటల్‌లో డాక్టర్స్ డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమన మాట్లాడుతూ... కనిపించని ఆరాధించే దేవుడు మనకు జన్మనిస్తే మన కళ్ల ముందు కనిపించే వైద్యుడు అనుక్షణం మన ఆర్యోగాలు కాపాడుతూ ఎన్నో పునర్జన్మలు ప్రసాదిస్తున్నారని తెలిపారు. హాస్పిటల్ సీనియర్ డాక్టర్ ఇంద్రసేనారెడ్డి మాట్లాడుతూ... పేషెంట్లు సేవ కోసం వారి వ్యాధి, బాధలకు తగ్గించడం కోసం రోగుల ప్రాణాలను కాపాడి వారి జీవితాలు నిలబెట్టడం కోసం డాక్టర్లు తమ జీవితాలను అంకితం చేస్తానని తెలిపారు. వైద్య వృత్తి ఎంతో ఉన్నతమైనదని తెలిపారు. వైద్య రంగంలో గొప్ప సేవలు అందించిన అటువంటి వైద్యులను స్మరించుకోవడమే నిజమైన డాక్టర్స్ డే అన్నారు. కార్యక్రమంలో హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్ దీప్తి, చీఫ్ ఆపరేషర్స్ ఆఫీసర్ డాక్టర్ కరుణాకర్‌రెడ్డి, డైరెక్టర్ మధుసూదన్‌రెడ్డి పాల్గొన్నారు.

గ్రూప్-4 పరీక్షలు ప్రశాంతం



ఎల్‌బీనగర్‌లోని మహాత్మాగాంధీ లా కాలేజీలోని పరీక్షా కేంద్రాన్ని పరిశీలిస్తున్న సీపీ చౌహాన్



ఎల్‌బీనగర్ అవినాష్ కళాశాలలో హాల్ టికెట్ నెంబర్‌లను చూసుకుంటున్న అభ్యర్థులు

హస్తినాపురం: ఎల్‌బీనగర్ జోన్ పరిధిలోని పలు విద్యా సంస్థల్లో శనివారం నిర్వహించిన గ్రూప్-4 పరీక్షలు పోలీసుల బందోబస్తు నడుమ ప్రశాంతంగా జరిగాయి. జోన్ పరిధిలోని దిల్‌సుఖ్‌నగర్, చైతన్యపురి, కొత్తపేట, హస్తినాపురం, మన్సూరాబాద్, నాగోలు, హయత్‌నగర్, వనస్థలిపురం తదితర ప్రాంతాలలోని పరీక్షా కేంద్రాలలో అభ్యర్థులు పరీక్ష రాసేందుకు హాజరయ్యారు. చంపాపేట డివిజన్ పరిధిలోని మారుతీనగర్ కాలనీలోని సక్సెస్ జూనియర్ కళాశాల, చంపాపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాల, కర్మన్‌ఘాట్‌లోని డీపీఎస్ వంటి పలు పరీక్షా కేంద్రాలలో సుమారు 420 మంది అభ్యర్థులు హాజరయ్యారు.

గ్రూప్-4 పరీక్షా కేంద్రాన్ని సందర్శించిన సీపీ చౌహాన్

నాగోలు: రాచకొండ పరిధిలోని గ్రూప్-4 పరీక్షా కేంద్రాల వద్ద పటిష్ట భద్రతా ఏర్పాటు చేశామని రాచకొండ పోలీస్ కమిషనర్ డి.ఎస్.చౌహాన్ అన్నారు. శనివారం ఎల్‌బీనగర్‌లోని మహాత్మాగాంధీ లా కాలేజీలోని గ్రూప్-4 పరీక్షా కేంద్రాన్ని ఆయన పరిశీలించారు.

నాగోల్ పీఎస్ పనుల పరిశీలన...

నాగోలు: రాచకొండ పోలీస్ కమిషనరేట్ పరిధిలో నాగోల్ మమతనగర్‌లో నూతనంగా ఏర్పాటు చేయనున్న నాగోలు పోలీస్ స్టేషన్ పనులను శనివారం రాచకొండ పోలీస్ కమిషనర్ డి.ఎస్.చౌహాన్ సందర్శించారు. పోలీస్ స్టేషన్ నిర్మాణ పనులను సీపీ పరిశీలించారు. త్వరగా పనులు పూర్తి చేయాలని అధికారులను అదేశించారు. త్వరలోనే పోలీస్ స్టేషన్‌ను ఏర్పాటు చేస్తామని సీపీ స్పష్టం చేశారు. ఎల్‌బీనగర్ డీసీపీ సాయిశ్రీ, ఎల్‌బీనగర్ ఏసీపీ శ్రీధర్‌రెడ్డి, ఎల్‌బీనగర్ ఇన్‌స్పెక్టర్ అంజిరెడ్డి, నాగోల్ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

మలక్‌పేటలో గ్రూప్-4 పరీక్షలు ప్రశాంతం

మలక్‌పేట: టీఎస్‌పీఎస్‌సీ శనివారం నిర్వహించిన గ్రూప్-4 పరీక్షలు మలక్‌పేట పీఎస్ పరిధిలో ప్రశాంతంగా ముగిశాయి. 3960 మంది అభ్యర్థులకుగాను 11 పరీక్ష కేంద్రాలు కేటాయించారు. ఉదయం 2967 మంది పరీక్షకు హాజరుకాగా 993 మంది గైర్హాజరయ్యారు. మధ్యాహ్నం 2959 హాజరు కాగా..1001 మంది గైర్హాజరయ్యారు. 75 శాతం మంది అభ్యర్థులు పరీక్షకు హాజరైనట్లు అధికారులు తెలిపారు. మలక్‌పేట ఇన్‌స్పెక్టర్ కస పరాజు శ్రీనివాస్ పరీక్ష కేంద్రాల వద్ద ముందస్తు జాగ్రత్తగా పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు. 75 శాతం మంది అభ్యర్థులు పరీక్షలకు హాజరైనట్లు అధికారులు తెలిపారు.

కేంద్ర పథకాలపై ముమ్మర ప్రచారం

చంపాపేట: మేరా బూత్ సబ్సే మజ్బూత్ కార్యక్రమంలో భాగంగా శనివారం చంపాపేట డివిజన్ పరిధిలోని పలు కాలనీలలో కార్పొరేటర్ వంగ మధుసూదన్‌రెడ్డి, తమిళనాడు బీజేపీ సీనియర్ నాయకులు యమునారాణితో కలసి గడప గడపకూ వెళ్లి కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను వివరించారు. పార్టీ నాయకులు పోరెడ్డి రవీందర్‌రెడ్డి, సద్ది సందీప్‌రెడ్డి, సుంకరి రమేష్‌గౌడ్, కవిలత, శ్రీకాంత్, కృపాకర్‌రెడ్డి, కరుణాకర్ రెడ్డి, శశివర్ధన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. బీఎన్‌రెడ్డి డివిజన్ పరిధిలోని ఎన్‌జీఓస్ కాలనీలో కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన శక్తి కేంద్ర ఇన్‌చార్జి, బూత్ స్థాయి అధ్యక్షుల సమావేశానికి బీజేపీ అల్పకాలిక విస్తారక్ అశోక్‌కుమార్ హాజరయ్యారు. లచ్చిరెడ్డి మాట్లాడుతూ... మేరా బూత్ సబ్సే మజ్బూత్‌లో భాగంగా పార్టీ కార్యకర్తలు ఇంటింటికీ వెళ్లా ప్రధాని నరేంద్రమోదీ అమలు పరుస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలపై విస్తృత ప్రచారం చేయాలన్నారు. నాయకులు విష్ణువర్ధన్‌రావు, శరత్‌కుమార్, శ్రీనివాస్‌శర్మ, శివశంకర్‌గౌడ్, శంకరయ్య, జైపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

ఆలయ అవకతవకలపై చర్యలు తీసుకోండి

సైదాబాద్: సైదాబాద్ ప్రధాన రహదారిపై ఉన్న పురాతన హనుమాన్ దేవాలయం విషయంలో ఇటీవల చోటుచేసుకున్న అవకతవకలపై తగిన చర్యలు తీసుకొని, ఆలయ అభివృద్ధికి అధికారులకు ఆదేశాలు జారీ చేయాలని డివిజన్ మాజీ కార్పొరేటర్ సింగిరెడ్డి స్వర్ణలతారెడ్డి దేవాదాయ శాఖ మంత్రిని కోరారు. శనివారం ఆమె సైదాబాద్ డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు పగిళ్ల శ్రీనివాసరెడ్డి, హనుమాన్ ఆలయ భక్తుల కమిటీ ప్రధాన కార్యదర్శి ముద్దం శ్రీకాంత్‌రెడ్డిలతో కలిసి మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డిని ఆయన కార్యాలయంలో కలిసి వినతిపత్రం సమర్పించారు. అనంతరం సైదాబాద్‌లో ఆమె విలేకరులతో మాట్లాడుతూ, దేవాదాయ శాఖ ఆధీనంలో ఉన్న హనుమాన్ దేవాలయానికి జీహెచ్‌ఎంసీ నుంచి రావాల్సిన భూమి నష్టపరిహారాన్ని ఆర్‌డీఓ వెంకటేశ్వర్లు ఆలయ పూజరి రఘునాథ్ ప్రసాద్‌కు ఏకపక్షంగా ఇచ్చారని తెలిపారు. ఆలయ భక్తుల నిరసనలతో తిరిగి నష్టపరిహారాన్ని స్వాధీనం చేసుకున్నారన్నారు. నష్టపరిహారం సొమ్ము దేవాలయానికి కేటాయించాలని ఆమె కోరారు. అభివృద్ధికి నోచుకోక జీర్ణావస్థకు చేరుకున్న ఆలయాన్ని అన్నిరకాలుగా అభివృద్ధి చేయాలని దేవాదాయ శాఖ మంత్రిని కోరామని, అందుకు ఆయన సానుకూలంగా స్పందించారని ఆమె తెలిపారు.

బీఆర్ఎస్ మోసపూరిత పాలన: సామ రంగారెడ్డి

హస్తినాపురం: తొమ్మిదేళ్ల కేంద్ర ప్రభుత్వ సుపరిపాలనలో ప్రజలు సురక్షితంగా ఉన్నారని, రాష్ట్రంలోని బీఆర్ఎస్ ప్రభుత్వం మోసపూరితమైన పాలనతో ప్రజలను దగా చేస్తోందని బీజేపీ రంగారెడ్డి అర్బన్ జిల్లా అధ్యక్షుడు సామ రంగారెడ్డి అన్నారు. ద్వారకానగర్‌కాలనీ, జయకృష్ణ ఎన్‌క్లేవ్‌కాలనీ, ఊర్మిళనగర్‌కాలనీ, టీచర్స్ కాలనీలో డివిజన్ బీజేపీ అధ్యక్షుడు పి.నరేశ్‌యాదవ్‌తో కలిసి మహాజన్ సంపర్క్ అభియాన్‌లో భాగంగా ఇంటింటికీ బీజేపీ కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా సామ మాట్లాడుతూ... కేంద్ర ప్రభుత్వం కరోనా సమయంలో ప్రతి పేదవాడి కడుపు నిండాలని 5 కిలోల ఉచిత బియ్యాన్ని అందించిందన్నారు. సీఎం కేసీఆర్ తొమ్మిది సంవత్సరాల కాలంలో పేదవారికి ఒక్క రేషన్ కార్డు కూడా ఇవ్వలేదని ఆరోపించారు. నేతలు దుర్గయ్యగౌడ్, అమరేందర్‌రెడ్డి, అరుణసింగ్, శిరీష, శేఖర్‌గౌడ్ పాల్గొన్నారు.

వసతుల కల్పనకు ప్రాధాన్యం

ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

మన్సూరాబాద్: నియోజకవర్గంలోని ప్రతి కాలనీలో మెరుగైన వసతుల కల్పనకు ప్రాధాన్యం ఇస్తున్నట్లు ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి పేర్కొన్నారు. మన్సూరాబాద్ డివిజన్ వీరభోగవసంతరాయులు కాలనీలో రూ. 26 లక్షలు, జడ్జెస్ కాలనీలో రూ. 15 లక్షలు, హయత్‌నగర్ పరిధి వినాయకనగర్‌కాలనీలో రూ. 37 లక్షలతో చేపడుతున్న సీసీ రోడ్డు పనులకు కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డితో కలిసి ఎమ్మెల్యే శనివారం శంకుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... నియోజకవర్గంలోని ప్రధాన సమస్యలను పరిష్కరించానని తెలిపారు. డ్రైనేజీ సమస్యలు తలెత్తకుండ సమగ్ర ప్రణాళికలతో ట్రంక్‌లైన్ పనులు చేపడుతున్నట్లు వెల్లడించారు. డ్రైనేజీ, మంచినీటి వసతి కల్పించిన తదుపరి సీసీ రోడ్డు నిర్మాణం జరుగుతుందని పేర్కొన్నారు. మాజీ కార్పొరేటర్ కొప్పుల విఠల్‌రెడ్డి, పోచబోయిన ఈశ్వరమ్మ యాదవ్, నాయకులు జక్కిడి మల్లారెడ్డి, నాంపల్లి రామేశ్వర్, జగదీష్‌యాదవ్, టంగుటూరి నాగరాజు, జక్కిడి రఘువీర్‌రెడ్డి, నాంపల్లి శంకరయ్య, పాతూరి శ్రీధర్‌గౌడ్, హరీష్‌రెడ్డి, ఎంజాల జగన్, కాలనీలవాసులు చంద్రారెడ్డి, కరుణాకర్‌రెడ్డి, శంకర్‌రెడ్డి, జెట్టి మహేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

వార్డు కార్యాలయాలతో మెరుగైన సేవలు



హయత్‌నగర్ వార్డు కార్యాలయంలో ఫైళ్లను పరిశీలిస్తున్న జెడ్‌సీ పంకజ

హయత్‌నగర్: మెరుగైన పాలనను ప్రజల చేరువకు తీసుకొచ్చి వారికి మరింత మెరుగైన సేవలు అందించేందుకే ప్రతి వార్డులో వార్డు కార్యాలయాన్ని ఏర్పాటు చేశామని, దీన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జీహెచ్‌ఎంసీ ఎల్‌బీనగర్ జోనల్ కమిషనర్ పంకజ అన్నారు. శనివారం ఆమె హయత్‌నగర్ డివిజన్ వార్డు కార్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా జెడ్‌సీ మాట్లాడుతూ... ప్రతి వార్డు కార్యాయలంలో టౌన్ ప్లానింగ్, శానిటేషన్, విద్యుత్, పెన్షన్, ఇంజినీరింగ్, ఎంటమాలజీ అధికారులతో పాటు 11 విభాగాలకు చెందిన అధికారులు అందుబాటులో ఉంటారని తెలిపారు. ప్రజలకు వ్యయప్రయాలను తగ్గించి పారదర్శకమైన సేవలు అందిస్తారని తెలిపారు. ప్రజలకు ఎలాంటి సందేహాలు ఉన్నా, అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించినా తన దృష్టికి తేవాలని ఆమె కోరారు. కార్యక్రమంలో టౌన్ ప్లానింగ్ అధికారి ఉమా, ఏఈ నరేంద్రతేజ తదితరులు పాల్గొన్నారు.

అనుమతి లేని పాఠశాలపై చర్యలు తీసుకోండి

సైదాబాద్: ఐఎస్‌సదన్ డివిజన్ లక్ష్మీనగర్ కాలనీలో అనుమతులు లేకుండా నిర్వహిస్తున్న ప్రైవేట్ పాఠశాలపై తగిన చర్యలు తీసుకోవాలని ఐఎస్‌సదన్ సీపీఐ కార్యదర్శి షేక్ మహమూద్ విద్యాశాఖ అధికారులను కోరారు. ఈ మేరకు ఆయన శనివారం పార్టీ నాయకులతో కలిసి సైదాబాద్ మండల డిప్యూటీ డీఈఓ రాధాకృష్ణను ఆయన కార్యలయంలో కలిసి ఫిర్యాదు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... విద్యాశాఖ అనుమతులు తీసుకోకుండా, విద్యార్థులకు ఎలాంటి సౌకర్యాలు కల్పించకుండా లక్ష్మీనగర్‌లో కొత్తగా ఏర్పాటు చేసిన పాఠశాల నిర్వాహకులు తల్లిదండ్రుల నుంచి మాత్రం పెద్ద మొత్తంలో ఫీజులు వసూలు చేస్తున్నారని ఆరోపించారు. అధికారులు వెంటనే స్పందించి సదరు పాఠశాల అడ్మిషన్లను అడ్డుకోవాలని కోరారు.

సీఎం సహాయనిధి పేదలకు వరం

హస్తినాపురం: ముఖ్యమంత్రి సహాయనిధి పేదలకు వరంలాంటిదని దీనిని సద్వినియోగం చేసుకోవాలని ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. హస్తినాపురం డివిజన్ హనుమాన్‌నగర్ కాలనీకి చెందిన చంద్రకళ అనే మహిళకు బ్రెయిన్‌స్ట్రోక్ రావడంతో కుటుంబ సభ్యులు ఆస్పత్రిలో చేర్పించి చికిత్స చేయించారు. అనంతరం ఆస్పత్రి నుంచి డిశ్చార్జి అయిన తర్వాత వారి ఆర్థిక పరిస్థితి బాగా లేకపోవడంతో వారి కుటుంబ సభ్యులు ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డిని సంప్రదించారు. స్పందించిన ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి చంద్రకళ ఆపరేషన్‌కు అయిన ఖర్చు డబ్బుల వివరాలతో సీఎం సహాయనిధికి దరఖాస్తు చేయించారు. బాధితురాలికి రూ. 3 లక్షలను మంజూరు చేయించి అందుకు సంబంధించిన చెక్కును బాధితురాలి భర్తకు అందజేశారు. కార్యక్రమంలో నేతలు శ్రీకాంత్‌రెడ్డి, రాకేశ్‌ఠాగూర్ తదితరులు పాల్గొన్నారు.

కూరగాయల ధరలు

దిల్‌సుఖ్‌నగర్: సరూర్‌నగర్/వనస్థలిపురం రైతుబజార్‌లలో వివిధ కూరగాయల ధరలు ఈ విధంగా ఉన్నాయి. టమాటా కిలో రూ. 91, వంకాయ 35, బెండ 40, పచ్చిమిర్చి 105, కాకర 45, బీర 35, క్యాలీఫ్లవర్ 28, క్యాబేజీ 18, క్యారెట్ 45, దొండ 35, ఆలు 21, ఉల్లి 20, గోకర 35, దోస 21, సొర 15, పొట్ల 23, అరటి 11, చిక్కుడు 75, అర్వి 35, మునగ 45, చిలగడదుంప 23, బీట్‌రూట్ 23, కీర 35, ఫ్రెంచ్ బీన్స్ 105, క్యాప్సికమ్ రూ 68 ప్రకారం ధర పలుకుతున్నాయి. ఈ ధరలు ఆదివారం 9 గంటల వరకు మాత్రమే అమలులో ఉంటాయి.